RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 261 | సెప్టెంబర్ 17, 2025 | వెల : రూ.3-00




సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

3లో..

# వర్సిటీలో లొల్లులేంది?

- అల్లర్లతో నిత్యం కేయూ అతలాకుతలం
- గొడవలకు కేరాఫ్‌గా విశ్వవిద్యాలయం
- పరిశోధన, బోధన కనుమరుగు
- అంధకారంలో విద్యార్థుల భవిష్యత్తు
- వర్సిటీ ఇన్‌చార్జి అధికారులు పట్టించుకోవాలి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**


ఉత్తర తెలంగాణలో ఉన్నత విద్యా ప్రమాణాలకు నెలవు కాకతీయ విశ్వవిద్యాలయం.. బోధన, పరిశోధన అనూహ్యమైన ప్రగతి విద్యా వాతావరణం వెల్లివెరిసే 620 ఎకరాల క్యాంపస్.. ఏ విభాగంలో చూసినా సెమినార్ల సందడి.. విద్యార్థుల్లో స్నేహపూరితమైన వాతావరణం.. అయితే, ఇదంతా ఇప్పుడు కాదండోయ్.. గతమెంతో ఘనకీర్తి అన్నట్టుగా కాకతీయ వర్సిటీ కీర్తి అంతా గతంలోనే వెతుక్కోవాలి. ప్రస్తుతం అంతా గందరగోళం.. అటకెక్కిన పరిశోధనలు, మచ్చుకైనా కానరాని నూతన ఆవిష్కరణలు, అరకొర బోధన, విద్యార్థుల ఘర్షణలు, భోజనాల కోసం పోరాటం, నాణ్యమైన ఆహారం కావాలంటే రోడ్డెక్కే పరిస్థితి... అధికారులపై అవినీతి మచ్చలు.. ఏకంగా ఏసీబీకే చిక్కిన వైనం.. వీటన్నింటికీ తోడు అన్నట్టుగా వర్సిటీలో లొల్లులు నిత్యం జరుగుతుండటం చూస్తుంటే అసలు విశ్వవిద్యాలయం గిట్లనేనా? ఉందేదనే అనుమానాలు కలుగుతున్నాయి.

**- ఘర్షణలతో వర్సిటీలో అలజడి**

కాకతీయ వర్సిటీలో అల్లకల్లోలం నెలకొంది. గత మూడు నాలుగు రోజుల నుంచి విద్యార్థుల మధ్య తీవ్రమైన ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఎవరో కొందరు మత్తులో తూలి తోటి విద్యార్థి పై చేయి చేసుకోవడంతో మొదలైన చిన్నపాటి లొల్లి చినికి చినికి గాలి వానగా మారింది. ఫలితంగా విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీసే వాతావరణంలో క్యాంపస్ అట్టుడుకుతున్నది. తమకు రక్షణ ఉందా? అని వర్సిటీలో స్టూడెంట్స్ అనుమానాలు రావడమే కాదు..ఓ రకంగా అలజడి అయితే కొనసాగుతున్నది. నిత్యం పోలీసుల పహారా, రాత్రివేళ ధర్నాలు, గదుల్లోని విద్యార్థుల్లో గుబులు, వెరసి విశ్వవిద్యాలయంలో అసలు చదువులకు స్థానమెక్కడ? అని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. విద్యార్థుల్లో అభిప్రాయ భేదాలు రావడంతో.. ప్రతి చిన్న విషయానికి లొల్లికి దిగడం, ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదులు చేసుకోవడంతో విద్యా వాతావరణానికి తీవ్రమైన విఘాతం కలుగుతున్నది. విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు కానీ, వసతి గృహాలకు సంబంధించిన అధికారులు కానీ తగువిధంగా స్పందించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఘర్షణల నేపథ్యంలో ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తిన విధంగా వ్యవహరించడం సరికాదని విద్యార్థులు అంటున్నారు. అయితే, ఈ నెల 8న వీసీ విదేశీ పర్యటనకు వెళ్లగా, వర్సిటీ ఇన్‌చార్జి అధికారుల పర్యవేక్షణ లోపం కనబడుతున్నది. ఆఫీసర్ల పర్యవేక్షణ లోపించడంతోనే ఘర్షణలు పునరావృతం అవుతున్నాయా?, లేదా విద్యార్థుల మధ్య తరచుగా తలెత్తుతున్న ఘర్షణలకు కారణాలేంటి? అనేది తెలుసుకోకపోవడం అధికారుల అసమర్థతకు నిదర్శనమని కొందరు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**- స్టూడెంట్స్‌కు రక్షణ కరువు?**

కొందరు ఆకతాయి విద్యార్థులు చేస్తున్న అల్లర్లు మెజార్టీ విద్యార్థులకు శాపంగా మారుతున్నది. విశ్వవిద్యాలయం క్యాంపస్ అంతా 70 మంది ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది ఉంది. వీరి పైన సెక్యూరిటీ ఆఫీసర్ కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఇక పోలీస్ ఇంటర్‌సెప్టార్ వాహనం నిత్యం చక్కర్లు కొడుతుంది. అయినా విద్యార్థులకు రక్షణ కరువైంది. అందరి వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. క్యాంపస్‌లో నెలకొన్న పరిస్థితి కారణంగా ఏ విద్యార్థిని కదిపినా భయం భయంగా సమాధానాలు వస్తున్నాయంటే.. వారు ఎంతగా ఆందోళన చెందుతున్నారో స్పష్టమౌతున్నది. ఇప్పటికైనా విశ్వవిద్యాలయంలో ఉన్నతాధికారులు స్పందించాలని, తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వాస్తవాలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటే ఆకతాయి విద్యార్థుల్లో భయం పుడుతుందని, అల్లర్లకు దిగాలంటేనే శిక్షలు గుర్తుకు వచ్చి వెనుకడుగు వేస్తారని, ఈ దిశగా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.






# ఆరోగ్య కేంద్రం, విద్యాలయంలో అకస్మిక తనిఖీ

**వేద న్యూస్,ఇల్లంతకుంట :**



ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. మంగళవారం ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని విభాగాలు, వార్డులను పరిశీలించి, సిబ్బంది హాజరు వివరాలు, రిజిస్టర్, ఫార్మసీ తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రతి రోజూ ఆసుపత్రికి వైద్యం కోసం ఎందరు వస్తున్నారో ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవల తీరుపై ఆసుపత్రికి వచ్చిన రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండాలని, సిబ్బంది సమయపాలన ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అందుబాటులో లేని సిబ్బంది పట్ల తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లో అందించే సేవలపై అవగాహన కల్పించాలని, ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు.


**- గ్యాస్ స్టవ్ పైనే మధ్యాహ్న భోజనం తయారుచేయాలి.**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీలో కలెక్టర్.పెద్దలింగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలకు వెళ్లిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నారు? అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.తరగతి గదులను సందర్శించి, ఎన్ని ఎల్ఈడీ ప్యానెల్స్ వివరాలను ఆరా తీశారు. తప్పనిసరిగా మధ్యాహ్న భోజనం గ్యాస్ స్టౌలపై మాత్రమే తయారు చేయాలని ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టీ బోధించాలని తెలిపారు.

# సంక్షేమ పథకాలు పేదలకు అందించడమే లక్ష్యం

## - మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని దూపకుంట, దేశాయిపేట్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కలెక్టర్ ఆఫీస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు తెలియ జేశారు. పేదలకల సహకారం అయ్యేలా అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరలోనే పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. పేదవారి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని ఈ సందర్భంగా కొండా మురళి తెలిపారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయడమే మా లక్ష్యం అని కొండా మురళి తెలిపారు.

# గురుకుల వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ

**వేద న్యూస్, చొప్పదండి :**

పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద గల సమీకృత బాలుర వసతి గృహం, ఎస్ సి సాంఘిక సంక్షేమం వసతి గృహం బాలికల గురుకుల పాఠశాలలను మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గదులను, టాయిలెట్లను పరిశీలించారు. శిథిలావస్థలోని భవనములను వెంటనే తొలగించుటకు మరియు టాయిలెట్ కు సంబంధించి అవసరం మరమ్మత్తు పనులను వెంటనే చేపట్టుటకు హాస్టల్ వార్డెన్ మన సంబంధిత ఎస్ఇ లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసిల్దార్ నవీన్ కుమార్, ఆర్ ఐ త్రిపాల్ సింగ్, ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంపీఓ రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్, ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ అంజయ్య, వార్డ్ అధికారులు, హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.



# ఎంజీబీఎస్‌లో కొత్త పాస్‌పోర్ట్ ఆఫీస్!

## - మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం

**వేద న్యూస్ డెస్క్:**



నగరవాసులకు పాస్‌పోర్ట్ సేవలను మరింత సులభతరం చేసేందుకు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) మెట్రో స్టేషన్‌లో కొత్తగా పాస్‌పోర్ట్ సేవా కేంద్రాన్ని (పీఎస్‌కే) ఏర్పాటు చేశారు. తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఈ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ మార్పుతో నగరంలోని రెండు ప్రధాన పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల చిరునామాలు మారాయి. వివరాల్లోకి వెళ్తే,

మిగతా 3వ పేజీలో..

# వైభావంగా విశ్వకర్మభగవాన్ జయంతి ఉత్సవాలు

**వేద న్యూస్, మెట్ పల్లి :**




మెట్ పల్లి స్వర్ణ కార సంఘం ఆధ్వర్యంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మ%శీ%ద్ర స్వామి వారి ఆలయంలో విశ్వకర్మ భగవానుని జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వంగళ మహేష్, ప్రధాన కార్యదర్శి తోగిటి విద్యాసాగర్, ఉపధ్యక్షుడు శ్రీపాద సతీష్, సహాయకార్యదర్శి కలికోట లక్ష్మన్, క్యాసియర్ మల్యాల రాజశేఖర్, మరియు ఇరు వ్యాపారసంఘాలు మరియు కార్మిక సంక్షేమ సంఘం మరియు సభ్యులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. 17 సెప్టెంబర్ విశ్వకర్మ జయంతి. పురస్కరించుకొని హెూమలు యజ్ఞలు కార్యక్రమ అనంతరం అన్న ప్రసాదం మరియు విశ్వకర్మ భగవానుని నీయమంజనం ఇట్టి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అధ్యక్షులు వంగళ మహేష్ వెళ్ళాడి%శీ%చారు.

# విత్తనోత్పత్తి క్షేత్రాలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం




**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వరి మరియు పెసర విత్తనోత్పత్తి క్షేత్రాలను వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ శాస్త్రవేత్త డా. ఇ. రజనీకాంత్. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం,కరీంనగర్ శాస్త్రవేత్త డా. కె. మదన్ మోహన్ రెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ క్షేత్ర సందర్శనలో భాగంగా శాస్త్రవేత్తల బృందం రైతులకు విత్తనోత్పత్తిలో మెళకువలను. ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం" కార్యక్రమంలో భాగంగా ఈ వానకాలం సాగుకి ప్రతి గ్రామానికి ముగ్గురు రైతులకు వరి మరియు పెసర విత్తనాలను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు. అర్చన,లలిత. రైతులు పాల్గొన్నారు.

# 'ఆదిత్య' ఆస్పత్రిలో ఫెర్టిలిటీ క్యాంపునకు స్పందన

## – పేషెంట్స్‌కు తగు సలహాలు, సూచనలిచ్చిన డాక్టర్

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కాకతీయ ఈ–టెక్నో స్కూల్ పక్కన ఉన్న ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మంగళవారం ఉచిత సంతాన సాఫల్యత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు.. ఈవా ఐవీఎఫ్ ద కంప్లీట్ ఫెర్టిలిటీ కేర్ వారు చేపట్టిన ఈ క్యాంపులో.. డాక్టర్ గ్రీష్మ ఒగ్గు..ఎంబీబీఎస్ ఎంఎస్ ఓబీ గైనిక్, స్త్రీల ప్రత్యేక వైద్యనిపుణులు.. ఇన్‌ఫెర్టిలిటీ పేషెంట్స్‌కు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. 37 మంది పేషెంట్స్ క్యాంపునకు హాజరైనట్టు ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. ఈ క్యాంప్‌లో రిజిస్ట్రేషన్, కన్సల్టేషన్ ఉచితం. సెమెన్ ఎనాలిసిస్, 3డి స్కానింగ్, వైరల్ మార్క్ ఉచితంగానే చేశారు.

# కోట్లకు పడగలెత్తిన ఏడీఈ అంబేద్కర్

**వేద న్యూస్ డెస్క్:**

ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణ నేపథ్యంలో విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్ ఇంట్లో ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారజాము నుంచి సాయంత్రం 5 గంటల వరకు విరామం లేకుండా సోదాలు నిర్వహించారు ఏసీబీ అధికారులు. ఏడీఈ అంబేద్కర్ నివాసంతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఏసీబీ అధికారులు మొత్తం 15 బృందాలుగా విడిపోయి గచ్చిబౌలి , మాదాపూర్ , హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లో పలుచోట్ల సోదాలు చేపట్టి.. ఆస్తుల వివరాలు సేకరించారు. అంబేద్కర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఏడీఈ అంబేద్కర్ కోట్లకు పడగలెత్తినట్లు ఏసీబీ అధికారులు నిర్ధారించారు. శేరిలింగంపల్లిలో ఒక ఫ్లాట్, గచ్చిబౌలిలో జీ ప్లస్ 5 భవనం, పది ఎకరాల్లో అమ్తర్ కెమికల్స్ ఫ్యాక్టరీ, హైదరాబాద్‌లో ఆరు రెసిడెన్షియల్ ప్రైమ్ ఓపెన్ ప్లాట్స్, ఒక వ్యవసాయ క్షేత్రం, రెండు కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఇక అంబేద్కర్ బినామీ ఇంట్లో రూ. 2.18 కోట్ల నగదు పట్టుబడింది.

# నారాయణపూర్ నిర్వాసితులకు పరిహారం అందజేస్తాం

**వేద న్యూస్, చొప్పదండి:**




గంగాధర ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ క్రింద భూములు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా కల్పించారు. గంగాధర మండలం నారాయణపూర్, మంగపేట గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను గంగాధరలోని ప్రజా కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నారాయణపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం అందించడానికి ప్రభుత్వం రూ. 23 కోట్లు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే వివరించారు. త్వరలోనే నిర్వాసితులకు పరిహారం అందజేస్తామని భరోసా కల్పించారు. ఇచ్చిన మాట ప్రకారం నారాయణపూర్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని, నిర్వాసితులకు పరిహారం అందజేస్తామని తెలిపారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి నిర్వాసితులు ఆందోళనకు గురికా వద్దని, అన్ని రకాలుగా అండగా ఉండి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# సేవ్ ఓజోన్ సేవ్ లైఫ్

**వేద న్యూస్, వరంగల్ :**




ఏవి వి జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో "ప్రపంచ ఓజోన్ దినోత్సవం "సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు ఓజోన్ క్షీణత దాని యొక్క ప్రభావం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ భుజంగ రెడ్డి వాలంటరీ ఉద్దేశించి మాట్లాడుతూ ఓజోన్ అన్నది భూమండలానికి సూర్యుని నుండి వచ్చేఅతినీలలోహిత వికిరణాల లను ఓజోను ఒక రక్షణ కవచంగా ఉంటుందని వివిధ రకాల కాలుష్యం ద్వారా అది రంధ్రం పల్చబడటం జరుగుతుందని దాని ప్రభావం మన పైన ముఖ్యంగా చర్మ వ్యాధులు ,క్యాన్సర్ తదితర వ్యాధులు వస్తాయని కావున మనమందరం పర్యావరణాన్ని రక్షించాలని చెట్లను విరిగా పెంచాలని అన్నారు.అలాగే కొడిమల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ అల్ట్రా వైలెట్ రేసెస్ ముఖ్యంగా క్లోరో ఫ్లోరో కార్బన్స్ వాయువులద్వారా ఇది క్షీణిస్తుందని మరియు వాహనాలు మరియు పరిశ్రమల నుండి వెలువడే కాలుష్యం (నైట్రోజన్ ఆక్సైడ్స్వారా )ఇది పల్చబడుతుందని కావున ప్రతి ఒక్కరు కాలుష్య నివారణలో తమ వంతు కృషి చేయాలని గొడుగులతో ఒక సింబాలిక్ గా మనకు సూర్యుని ఎండ నుండి ఎలా అయితే కాపాడుతుందో గొడుగు అలాగే సూర్యుని నుండి వచ్చే అల్ట్రా వైలెట్ రేసెస్ నుండి భూమిని ,మనల్ని ఈ ఓజోను పొర పరిరక్షిస్తుందని కావున ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బరుపాటి గోపి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఎస్ అనిత,రమేష్, సీనియర్ వాలంటీర్లు దేవి శ్రీ ప్రసాద్ ,సాకేత్ ,రాజకుమార్, సాత్విక్, చిరంజీవి, సాయి హర్షిత్, నవ్య, చందన ,మన్విత, సాత్విక, మిన్ను తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తత అవసరం

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి పల్లె దవాఖాన/ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ ఆధ్వర్యంలో మంగళవారం కేసన్నపల్లి గ్రామంలోని గ్రామ పంచాయతీ భవనం లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి శిబిరంలో 64 మంది చేకపు చేసుకున్నారు అందులో 4 ఫీవర్ కేసులకి ఆర్ డి టి మలేరియా టెస్ట్ చేయడం జరిగింది మిగిలిన వారందరికీ బి పి, షుగర్ పరీక్షలు చేసి ఉచితముగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా పల్లె దవాఖాన వైద్యాధికారి మాట్లాడుతూ గాలిపల్లి పల్లె దవాఖాన పరిధిలోని 5 గ్రామాల ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని ప్రజలందరు నిరు నిల్వ ఉండకుండా ప్రతిరోజూ డ్రై డే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అలాగే వ్యక్తిగత శుభ్రత పాటించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గాలిపల్లి పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ కట్ట రమేష్ ,ఏ ఎన్ ఎం కవిత,ఆశాలు రుజన, లక్ష్మి, సరిత, ప్రజలు, మిగతా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

**వేద న్యూస్, కమలాపూర్ :**




హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రోజున జెండా ఎగురవేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి నకిర్త ఓదేలు అధ్యక్షత వహించగా, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్ హాజరై జెండా ఎగురవేశారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే లిఖించదగిన గొప్ప పోరాటమని అటువంటి గొప్ప పోరాటాన్ని హిందూ ముస్లిం మధ్య జరిగిన యుద్ధంగా విష ప్రచారం చేస్తున్నటువంటి భారతీయ జనతా పార్టీ అసలు ఆ పార్టీకి ఉద్యమంతో సంబంధం లేదు కాబట్టి దానిపై ఆ పార్టీకి మాట్లాడే హక్కు కూడా లేదని అన్నారు. నిజాం రాజుల నిరంకుశ పాలనలో ప్రజలకు జీవించే హక్కు లేకుండా ప్రజల హక్కులన్నీ కాలరాసే విధంగా పాలన చేస్తూ, గ్రామాల్లో ప్రజలను వెట్టి చాకిరి చేపిస్తూ బానిసలుగా చేసిన ఆనాటి భూస్వాములు అయిన రజాకారుల ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలు ఎదురు తిరిగి చేసిన పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అని అన్నారు. ఆనాడు రజాకార్ల ఆగడాలతో పీడింపబడిన ప్రజలకు అండగా వారి రక్షణకై, విముక్తికై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మగ్దుమ్ మోహినుద్దీన్ వారితోపాటు 4500 మంది కమ్యూనిస్టులు ఆనాడు పోరాటంలో రక్తం చిందించి ఆ పోరాటంలోని అమరులైనారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆనాడు కమ్యూనిస్టులు పోరాటం చేసి 3000 గ్రామాలకు పైగా వెట్టి చాకిరి, బానిసత్వం నుంచి విముక్తి కల్పించి దాదాపుగా 10 లక్షల ఎకరాలను పేద ప్రజలకు ఉచితంగా అందించారని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లోనే చాకలి ఐలమ్మ, బి.ఎన్.రెడ్డి, నల్ల నరసింహులు లాంటి ఎందరో కమ్యూనిస్టు నాయకులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి చివరకు పోరాటంలోనే తమ ప్రాణాలను కోల్పోయారని అందు కారణంగానే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సమరయోధులను స్మరించుకునేందుకే సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కు రాజు గౌడ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి గోలే మహేందర్, కొలుగూరి బాలరాజు, ఇసంపల్లి ఐలయ్య, గూడూరు సుధాకర్, సిపిఐ సీనియర్ నాయకులు ధర్మల రామ్మూర్తి, లచ్చయ్య, కమలాపూర్ సిపిఐ గ్రామ కార్యదర్శి బొజ్జం లక్ష్మి, రాణి, చిగురు రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిఐ-2005 చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**




జిల్లాలో సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) 2005 ను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సమాచార హక్కు చట్టం పై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సమాచార హక్కు చట్టం కమిషనర్లు దేశాల భూపాల్, పీవీ శ్రీనివాస రావు, అయోధ్య రెడ్డి, మొహసిన పర్వీన్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ,సమాచార హక్కు చట్టం గత కొన్ని రొజులుగా నిర్లిప్తత ఏర్పడినట్లు భావం అందరిలో వచ్చిందని, 2 సంవత్సరాల పాటు ఆర్టిఐ కమిషనర్ నియామకం కాకపోవడంతో 17 వేల కేసులు పెండింగ్ ఉన్నాయని అన్నారు. పెండింగ్ కేసులను త్వరగా డిస్పోస్ చేయడంతో పాటు అధికారులలో ఉన్న నిర్లక్ష్యం తొలగించాలనే ఉద్దేశంతో జిల్లాల పర్యటన చేపట్టామని అన్నారు. మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం మొదలగు జిల్లాలో ఇప్పటి వరకు పర్యటించామని అన్నారు.ఆర్టిఐ చట్టం పై జిల్లా అధికారులకు అవగాహన కల్పించామని అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి, మొదటి అప్పిలేట్ అథారటి, రెండవ అప్పిలేట్ అథారటి పేర్లు, ఫోన్ నెంబర్ లతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. 2005 పార్లమెంట్ ఆమోదించిన చట్టం ప్రకారం ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్ట్ తో పాటు సెక్షన్ 4 (1) (బి) వివరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని, అటువంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకుని వస్తున్నామని అన్నారు.అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేకుండా ప్రజలు కోరిన సమాచారం నిర్ణీత సమయంలో అందించాలని అన్నారు. ఆర్టిఐ చట్టం ప్రకారం అవగాహనతో అమలు చేస్తే అక్రమాలు తగ్గిపోతాయని అన్నారు. ప్రజలు సమాచారం అధికంగా తెలుసుకోవడం వల్ల జరిగే మోసాల నుంచి తప్పించుకోవచ్చని అన్నారు.

సామాన్యుడు చేతిలో వజ్రాయుధం ఆర్టిఐ చట్టం అని అన్నారు. సమాజంలో వాచ్ డాగ్ లాగా సమాచార హక్కు చట్టం పని చేస్తుందని తెలిపారు . జిల్లా అధికారులు సమాచార హక్కు చట్టాన్ని తప్పనిసరిగా పాటిస్తూ పారదర్శకంగా అమలు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల,వేములవాడ అదనపు ఎస్పీలు చంద్రయ్య, శేషాద్రిని రెడ్డి, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు,రాధాబాయి, జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఫస్ట్ అప్పిలేట్ అధికారులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు పోలీస్ అధికారులు సంబంధిత అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీబీఎస్‌లో కొత్త పాస్‌పోర్ట్ ఆఫీస్!



ఇన్ని రోజులు అమీర్‌పేటలోని ఆదిత్య ట్రేడ్ సెంటర్‌లో కొనసాగిన పాస్‌పోర్ట్ సేవా కేంద్రాన్ని ఇప్పుడు ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌కు పూర్తిగా తరలించారు. అదేవిధంగా, టోలీచౌకీ షేక్‌పేట్‌లోని ఆనంద్ సిలికాన్ చిప్ భవనంలో పనిచేస్తున్న మరో కేంద్రాన్ని రాయదుర్గం పాత ముంబయి రోడ్డులోని సిరి బిల్డింగ్‌లోకి మార్చారు. మంగళవారం నుంచి ఈ రెండు కేంద్రాలు తమ కొత్త ప్రదేశాల నుంచి పూర్తిస్థాయిలో సేవలను అందిస్తాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, పాస్‌పోర్ట్‌ల జారీలో హైదరాబాద్ దేశంలోనే ఐదో స్థానంలో ఉందని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం ఐదు పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు ప్రజలకు సేవలందిస్తున్నాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మిర్జా రియాజ్ ఉల్ హసన్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, పాస్‌పోర్ట్స్ జాయింట్ సెక్రటరీ కే.జే.శ్రీనివాసులు, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరతతో రైతులకు ఇక్కట్లు

**- అధికార యంత్రాంగం ఎరువుల సరఫరాకు చొరవ తీసుకోవాలి - టీఆర్ఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్**

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని తెలంగాణ రైతు రక్షణ సమితి(టీఆర్ఆర్ఎస్) హనుమకొండ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల అధ్యక్షుడు హింగే భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పీఏసీఎస్ గోదాం వద్ద మీడియా సమావేశంలో మాట్లాడారు. పీఏసీఎస్ టోకెన్ల ప్రకారం ఒక రైతుకు రెండు బస్తాలు చొప్పున యూరియా పంపిణీ చేస్తున్నారని, అయితే మంగళవారం టోకెన్లు ఇవ్వడం లేదని మండలంలోని రైతులు తెలియజేశారని, దీంతో సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు టోకెన్లు ఇప్పించినట్టు వెల్లడించారు. మండలంలో యూరియా కొరత రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత వానాకాలం వ్యవసాయంలో అత్యంత కీలక దశలో రైతులు ఎరువుల కోసం అల్లాడుతున్నారని చెప్పారు. యూరియా లేక పంటలు వాడి పోతున్నాయనే ఆందోళనలో రైతులు రాత్రింబవళ్లు సొసైటీ, బ్యాంకుల ముందు క్యూలైన్లలో గడుపుతున్నారని వివరించారు. నిద్రాహారాలు మాని పడిగాపులు కాస్తూ, ఎరువుల కోసం వేచి చూసే పరిస్థితి రైతాంగం రోజువారీ జీవితాన్ని దెబ్బతీస్తోందని చెప్పారు. చాలామంది రైతులు వయస్సు, అనారోగ్యం కారణంగా గంటల తరబడి క్యూలైన్లో నిలబడలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కొంతమంది రైతులు ఆనారోగ్య సమస్యలకు గురవుతుండగా, వర్షం,ఎండలతోనూ నిల్చోవడం మరింత భారమవుతోందని స్పష్టం చేశారు. అన్నదాతల బాధలు వర్ణనాతీతం అని వెల్లడించారు. యూరియా సరఫరాలో జాప్యం రైతాంగాన్ని నేరుగా ప్రభావితం చేస్తోందని తెలిపారు. పంటకాలం మధ్యలో ఎరువు అందకపోతే దిగుబడులు తీవ్రంగా తగ్గే అవకాశం ఉందని, ఇది రైతుల ఆర్థిక పరిస్థితిని మరింత కుదేలు చేస్తుందని హెచ్చరించారు. అధికార యంత్రాంగం చొరవ తీసుకుని యూరియా సరఫరాను సక్రమంగా నిర్వహించాలని, ప్రతి రైతు అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని పారదర్శకంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు రక్షణ సమితి మండల కార్యదర్శి కోదాటి రామారావు, నేతలు నార్లగిరి మొగిలి, మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణలో భారీ వర్షాలు..!

**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణలో మరో రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని పేర్కొంది. ఈ క్రమంలో మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. బుధవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా గడిచిన 24గంటల్లో ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, మంచిర్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, మెదక్, వికారాబాద్‌తో పాటు పలుచోట్ల భారీ వర్షపాతం నమోదైంది.

# వైద్య విద్యా నిమిత్తం శరీర దానం




**వేద న్యూస్, హన్మకొండ :**

వరంగల్ అర్బన్ ప్రశాంత్ నగర్ సహృదయ ఆశ్రమం నివాసి ఉదయమ్మ 69 అనారోగ్యంతో మరణించగా, నిర్వాహకులు యకూబీ చోటేమియా సమాజ హితం కోరి, వైద్య విద్యా నిమిత్తం, మెడికల్ కాలేజీకి శరీర దానం చేయుటకు అంగీకరించగా, తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్ లో దేహాన్ని కేఎంసీ అనాటమీ విభాగానికి అప్పగించారన్నారు. ప్రొఫెసర్ డా శశికాంతా అనాటమీ విభాగాధిపతి ఆదేశంతో అనటమీ వైద్య విద్యార్థులు, సిబ్బంది ప్రేమ్ కుమార్, యాద గిరి, ప్రణయ్ దేహాన్ని అనటమీ విభాగానికి తరలించారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శశి కాంతా మాట్లాడుతూ బావి వైద్యులకు వైద్య విద్య అధ్యయనం కోసం, శాస్త్ర పరిశోధన కోసం, సర్జరీని నేర్చుకోవడానికి ఉదయమ్మ దేహం వైద్య పాఠం అయింది అని ప్రొఫెసర్ అన్నారన్నారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి మాట్లాడుతూ మరణానంతరం శరీర దానం చేస్తే వందల మందికి వైద్య పాఠం అవుతాం అని వివరాలకు కొరకు 8790548706, 9490133650 ఈ ఫోన్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ రాజేంద్రప్రసాద్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు ఏ కేదారి తదితరులు పాల్గొన్నారు.

# 25న బతుకమ్మకుంటలో బతుకమ్మ ఉత్సవాలు

**వేద న్యూస్ డెస్క్:**



బతికే ఉన్నాను అని నిరూపించుకున్న బతుకమ్మ కుంట.. పేరును సార్థకత చేసుకుంటూ ఇప్పుడు బతుకమ్మ ఉత్సవాలకు సిద్ధమౌతోంది. ఈ నెల 25వ తేదీన బతుకమ్మ ఉత్సవాలకు బతుకమ్మ కుంట వేదికౌతోంది. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఈ ఉత్సవాలకు హాజరౌతున్నారు. అదే రోజు పండగ వాతావరణంలో బతుకమ్మకుంటను నగర ప్రజలకు ముఖ్యమంత్రి అంకితం చేయనున్నారు. బతుకమ్మ కుంట వద్ద ఈ ఉత్సవ ఏర్పాట్లను ముఖ్యమంత్రి సలహాదారుడు శ్రీ వేంనరేందర్ రెడ్డి గారు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షించారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు, జీహెచ్ ఎంసీ కమిషనర్ శ్రీ ఆర్‌వీ కర్ణన్, జలమండలి ఎండీ కె. అశోక్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొని అక్కడి ఏర్పాట్లను వివరించారు. జాతీయ స్థాయిలో బతుకమ్మ కుంటకు గుర్తింపు వచ్చేలా ఇక్కడ బతుకమ్మ ఉత్సవాలు జరగాలని సమీక్ష సమావేశంలో శ్రీ వేంనరేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. బతుకమ్మ కుంట చుట్టూ రాబోతున్న ఆకర్షణలను అడిగి తెలుసుకున్నారు.

**- హైడ్రా కృషి అభినందనీయం..**

ఆక్రమణలకు గురై నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి పిచ్చి మొక్కలతో అటువైపు వెళ్లాలంటే కాదు.. కనీసం చూడాలంటే భయపడే విధంగా బతుకమ్మ కుంట మారిపోయింది. కబ్జాల చెర నుంచి విముక్తి చేసి.. సర్వాంగ సుందరంగా బతుకమ్మ కుంటగా తీర్చడంలో హైడ్రా కృషి అభినందనీయం%-% అని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు అన్నారు. కబ్జాల చెర నుంచి విముక్తి చేయడానికి రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ ఎంసీ శాఖలతో సమన్వయం చేసుకుంటూ.. కోర్టుకు వాస్తవాలు వివరించి బతుకమ్మకుంటకు జీవం పోసిన ఘనత హైడ్రాదే అని కొనియాడారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు ఇదో యజ్ఞలా చేశారంటూ అభినందించారు. బతుకమ్మ కుంట ఆక్రమణలను తొలగించి.. చెరువుగా అభివృద్ధి చేయాలని తాము కోరగానే ముఖ్యమంత్రి గారు ఈ పనిని హైడ్రాకు అప్పగించారు.

**- అందరూ రావాలి.. బతుకమ్మ ఆడాలి..**

బతుకమ్మ కుంట పరిసరాలు ఎంతో ఆహ్లాదంగా ఉన్నాయి. ఇక్కడ ఈ నెల 25న జరగనున్న బతుకమ్మ ఉత్సవాలకు అందరూ రావాలి.. బతుకమ్మ ఆడాలి అని మేయర్ శ్రీమతి గద్వాల్ విజయలక్ష్మి, వి హనుమంతరావు కోరారు. నగరంలో మొదటి విడతా చేపట్టిన 6 చెరువులలో బతుకమ్మకుంట ప్రథమంగా సిద్ధమవ్వడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీ వి. హనుమంతరావు గారు అన్నారు. ఉత్సవాలకు కూడా ముఖ్యమంత్రి గారు వస్తానని చెప్పడం.. ఎంతో ఆనందంగా ఉందన్నారు. పార్టీలకతీతంగా అందరూ వచ్చి.. నగరంలో మరిన్ని చెరువుల అభివృద్ధికి ప్రోత్సాహకంగా ఈ ఉత్సవాలు జరగాలని కోరారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో చర్చగా మారిని బతుకమ్మ కుంట అభివృద్ధి ఉత్సవాలతో మరోమారు దేశవ్యాప్తంగా మారుమోగాలని కోరారు.

## జిఎస్‌టి కొత్త శ్లాబులు..
# కమలానికి కలిసొచ్చేనా!

జిఎస్‌టి శ్లాబుల మార్పు అంశాన్ని బలమైన రాజకీయ అస్త్రంగా మల్చుకొనేందుకు బిజెపి సిద్ధమవుతోంది. ఇప్పటికే అమలులోనున్న జిఎస్‌టి విధానంతో ప్రధాని నరేంద్ర మోడీ కేవలం కార్పొరేట్ శక్తులకే మేలు చేశారని ఆయన రాజకీయ ప్రత్యర్థులు విమర్శిస్తూ వచ్చారు. వాటిని ఎదుర్కొనేందుకు తాజాగా జిఎస్‌టి శ్లాబుల మార్పుతో తాము పేద, సామాన్య, మధ్య తరగతి పక్షమని చెప్పుకొనే ప్రయత్నం చేస్తోంది. చరిత్రలో ఏ ప్రభుత్వం చేయనంతగా మిడిల్ క్లాస్‌కు ప్రధాని మేలు చేశారని బిజెపి అంటోంది. మోడీ వల్లనే ఈ రోజున మధ్యతరగతి పేదవర్గాలు అనూహ్యంగా లబ్ధి పొందుతున్నాయని జనంలోకి వెళ్లి గట్టిగా చెప్పుకొనేందుకు బిజెపి ప్రయత్నాలు సాగిస్తోంది. వాస్తవానికి జిఎస్‌టి శ్లాబుల వల్ల సామాన్య, మధ్యతరగతికి ఊరట లభిస్తున్నది. కానీ మోడీ సర్కార్ ఈవర్గాలకు దీపావళి, దసరా కానుక ఇచ్చింది అనడం ఎంతవరకు సమంజసమన్నది ఆలోచించాలి. అదేసందర్భంలో జిఎస్‌టి శ్లాబుల మార్పు కారణంగా 12%, 28% శ్లాబులను ఎత్తివేసి కేవలం 5%, 18% శ్లాబులు మాత్రమే కొనసాగించనున్నారని, వీటి వల్ల కేంద్రం రూ. 48,000 కోట్ల ఆదాయం కోల్పోతుందని రెవెన్యూ శాఖ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ వెల్లడించారు. నల్లచట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతన్నలు ఉద్యమమే నడిపితే గానీ వాటి రద్దుకు దిగిరాని మోడీ సర్కార్ ఎవరూ కోరకుండానే జిఎస్‌టి శ్లాబులను మార్చి పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మేలు చేసేందుకు సిద్ధమైందంటే కాస్త ఆలోచించాల్సిన విషయమే. అందుకే మోడీ సర్కార్ అమలు చేయనున్న జిఎస్‌టి శ్లాబుల మార్పు నిర్ణయం వెనుకఉన్న మర్మమేమిటీ అన్నది ఇక్కడ ఆలోచన చేయాలి. ఈ జిఎస్‌టి శ్లాబుల మార్పు వల్ల ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర వస్తువులు చాలా వరకు జీరో శాతం జిఎస్‌టి లేదా 5% జిఎస్‌టి పరిధిలోకి రానున్నాయన్నది అందరికీ తెలిసిందే. ఇప్పటికే అమలులోనున్న జిఎస్‌టి విధానంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశనంటాయన్నది కూడా వాస్తవం. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశనంటినా పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల నెలసరి సంపాదనలో మాత్రం ఆ మేర పెరుగుదల కనిపించలేదు. అంటే అరకొర ఆదాయంతో ఈ వర్గాల కొనుగోలుశక్తి తగ్గింది. పేద, సామాన్య, మధ్య తరగతి వర్గాలు నిత్యావసర వస్తువుల కొనుగోలుకోసం తీర్చగలిగినంత మేరకే అప్పులు చేస్తారు.


తాహత్తుకు మించి అప్పులు చేయరు. అవసరమైతే సర్దుబాటు ధోరణీని అవలంబిస్తారు. అంటే నిత్యావసర వస్తువులలో కూడా కచ్చితంగా అవసరమైన వాటినే కొనుగోలు చేస్తారు. అది కూడా తమ ఆదాయం మేర వాటికి అనుగుణమైన పరిమితిలో కొనుగోలు చేస్తారు. ఇది సామాన్య, మధ్య తరగతి ప్రజల స్వభావం. అంటే ఎక్కువ మోతాదులో జిఎస్‌టిని నిత్యావసర వస్తువుల మీద విధిస్తే వాటి కొనుగోలు కూడా తగ్గుతుంది. అంటే ప్రజల కొనుగోలుశక్తి తగ్గితే వ్యాపార లావాదేవీలపై వాటి ప్రభావంపడి కేంద్రానికి జిఎస్‌టి రూపంలో వచ్చే ఆదాయం కూడా తగ్గుతుంది. అంటే మోడీ సర్కార్ ఇప్పటికే అమలు చేస్తున్న జిఎస్‌టి విధానంతో సామాన్య, మధ్యతరగతి వర్గాల కొనుగోలుశక్తి తగ్గి ఆ మేర జిఎస్‌టి రూపంలో కేంద్రానికి వచ్చే ఆదాయం కూడా తగ్గి వుండే అవకాశాలు ఉన్నాయి. అంటే ఇక్కడ జిఎస్‌టి ఆదాయం తగ్గివుంటే అది మోడీ సర్కార్‌కు నష్టం వచ్చేంతగా కాదని గుర్తించాలి. సామాన్య, మధ్యతరగతి వర్గాల నుంచి అధిక పన్నుతో పీడించి వసూలు చేయాలనుకొనే ఆదాయ అంచనాల్లో కాస్త తగ్గుదల కనిపించవచ్చు. అదే జిఎస్‌టి పన్ను తగ్గిస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గి సామాన్య, మధ్యతరగతి వర్గాల కొనుగోలుశక్తి పెరిగి పన్ను రూపంలో కేంద్రానికి వచ్చే ఆదాయం పెరిగే అవకాశముంటుంది. ఇదే లాజిక్ ను ఇపుడు మోడీ సర్కార్ జిఎస్‌టి శ్లాబ్నుల సవరణలో ప్రదర్శించింది. మరోవైపు ఈ జిఎస్‌టి సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను బలపరుస్తాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ప్రస్తుతం భారతదేశ జిఎస్‌టి సుమారు రూ. 330 లక్షల కోట్లుగా ఉంది. ఇందులో వినియోగం వాటా రూ. 202 లక్షల కోట్లు. జిఎస్‌టి రేట్లు తగ్గడం వల్ల ధరలు తగ్గి, ప్రజలు ఎక్కువ వస్తువులు కొనుగోలు చేస్తారు. జిఎస్‌టి తగ్గింపు వల్ల ప్రజల వినియోగం కనీసం 10 శాతం పెరిగినా, దేశ ఆర్థిక వ్యవస్థకు అదనంగా రూ. 20 లక్షల కోట్లు జత అవుతుందని అంచనా వేశారు. వాస్తవానికి జిఎస్‌టి శ్లాబుల మార్పుతో కేంద్రానికి రూ.48,000 కోట్ల నష్టం తాత్కాలికంగా జరిగినా, ధరల తగ్గుదలతో ప్రజలు కొనుగోలుశక్తి పెరిగితే ప్రభుత్వ ఖజానాకు అదనంగా రూ. 20 లక్షల కోట్లు జత అవుతుందన్నది మోడీ సర్కార్ లెక్క. దీనిని బట్టి చూస్తే మోడీ సర్కార్ ఈ జిఎస్‌టి శ్లాబుల మార్పుతో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు దసరా, దీపావళి కానుక ఇచ్చిందా లేక తాను ఈ కానుక పొందుతుందా అన్నది ఇక్కడ స్పష్టమవుతోంది. వచ్చే ఏడాది చూస్తే తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికలు ఉన్నాయి. ఇక 2027లో ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల ఎన్నికలు ఉన్నాయి. వీటిలో పాటు మరికొన్ని కీలక రాష్ట్రాలున్నాయి.

వివిధ రాష్ట్రాల ఎన్నికలు ముందుంటే మరోవైపు ఇండియా కూటమి తరఫున ప్రారంభమైన ఓట్ చోర్ గద్ది ఛోడ్ ఉద్యమం మరోవైపు బిజెపికి పెనుసవాళ్లు విసురుతోంది. దీంతో తాజాగా కేంద్రంలోని మోడీ సర్కార్ జిఎస్‌టిలో మార్పులు తీసుకొచ్చి తమది సామాన్యుడి, మధ్యతరగతి ప్రభుత్వమని చెప్పుకొనే ప్రయత్నం చేస్తోంది. దాదాపు పదకొండేళ్ల మోడీ పాలనలో జిఎస్‌టి నిర్ణయాలతో పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు నష్టపోయింది ఎంతో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ప్రజల కడుపు మాడ్చి ఎన్నికలకు ముందు బిర్యాన్నీ ఫ్రీ అని ప్రకటించి పబ్బం గడుపుకోవడం రాజకీయ పార్టీల నైజం. ఈ విషయంలో బిజెపి అన్ని పార్టీల కంటే పదిఆకులు ఎక్కువే చదివింది. ఈ కోవలోనిదే తాజాగా చేసిన జిఎస్‌టి శ్లాబు మార్పుల నిర్ణయం. ఓట్ చోర్ గద్దీ ఛోడ్ ఉద్యమంనుంచి ప్రజల దృష్టిన మళ్లీంచడం, జిఎస్‌టి తగ్గింపుతో సామాన్య, మధ్యతరగతికి పెద్ద ఎత్తున్న మేలు చేశామని చెప్పుకోవడం, మరోవైపు ప్రజలు కొనుగోలుశక్తిని పెంచి తన ఖజానాకు ఆదాయం పెంచుకోవడం వంటి లాజిక్ నిర్ణయమే ఈ జిఎస్‌టి శ్లాబుల మార్పు అంశాన్ని చూడాలి.

## రాజ్యాంగంపై, సుప్రీంకోర్టుపై
# బీజేపీకి ఏమాత్రం గౌరవం లేదు

**– బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు**

**వేద న్యూస్ డెస్క్:**



భారత రాజ్యాంగంపైన, సుప్రీంకోర్టుపైన బీజేపీకి ఏమాత్రం గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. పహల్గాం మారణకాండకు కారణమైన పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడటం బీజేపీ కపట దేశభక్తికి నిదర్శనమని మంగళవారం ఉదయం కేటీఆర్ ఓ ట్వీట్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను బీఆర్ఎస్ స్వాగతించడాన్ని బీజేపీ విమర్శిస్తోంది. బీజేపీది నకిలీ జాతీయవాదమని, తమది ఆచరణలో, ఆత్మలో నిజమైన జాతీయవాదమని స్పష్టంచేశారు. కులం, మతం, వర్గం చూడకుండా ప్రతి భారతీయుడిని సమానంగా ఆదరించడమే తమ దృష్టిలో నిజమైన జాతీయవాదం అన్నారు. జాతీయవాదానికి, దురహంకార దేశభక్తికి మధ్య ఉన్న తేడాను తెలుసుకోవడమే అసలైన దేశభక్తి అని చెప్పారు. పహల్గాం దారుణ మారణకాండకు కారణమైన పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడించిన బీజేపీకి బీఆర్ఎస్ దేశభక్తి గురించి ప్రశ్నించే నైతిక అర్హత లేదని విమర్శించారు. పాక్ ప్రేరేపిత ఉగ్రదాడిలో మరణించిన 26 మంది అమాయకుల నెత్తురు తడి ఇంకా ఆరకముందే ఆ దేశంతో క్రికెట్ ఆడేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒప్పుకోవడం ఆ పార్టీ నకిలీ జాతీయవాదం, కపట దేశభక్తికి తిరుగులేని సాక్ష్యం అన్నారు. పహల్గాం బాధిత కుటుంబాలు తీవ్రంగా వ్యతిరేకించినా ఏ మాత్రం పట్టించుకోకుండా కోట్లాది భారతీయులను మోదీ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆరోపించారు.

# ఆక్రమణలను తొలగించండి

**వేద న్యూస్ డెస్క్:**




వర్షాలు ముంచెత్తుతున్న వేళ నాలాల ఆక్రమణలపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఒక చెరువు నుంచి మరో చెరువుకు ఉన్న నాలాలు కబ్జాకు గురి అవ్వడంతో పాటు.. వరద కాలువలన్నీ ఎక్కడో ఒక దగ్గర ఆక్రమణలకు గురై వరద నీరు తమ నివాసాలను ముంచెత్తుతోందని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. క్యాచ్‌మెంట్ ఏరియా ఎంత ఉంది.. నాలా ఎంత వెడల్పులో ఉంటే సరిపోతుంది అనే విషయాన్ని అధ్యయనం చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు.. సర్వే నంబరు ఒకటి చూపించి మరో చోట ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని, పార్కులు, ప్రజావసరాలకు ఆద్దేశించిన స్థలాలు కబ్జా చేస్తున్నారంటూ పలువురు ఫిర్యాదులందజేశారు. ఇలా హైడ్రా ప్రజావాణికి సోమవారం వచ్చిన 26 ఫిర్యాదుల్లో ఎక్కువ నాలాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపైనే ఉన్నాయి. ఫిర్యాదులను హైడ్రా అదనపు కమిషనర్ శ్రీ ఎన్ అశోక్ కుమార్ గారు పరిశీలించి సబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలను అప్పగించారు.

కూకట్‌పల్లి మున్సిపాలిటీ, హైదర్‌నగర్ డివిజన్ రామ్‌నరేష్ నగర్‌కాలనీ వరద నీటి కాలువ ద్వారా వర్షపు నీరు సాఫీగా అలీతలాబ్ చెరువులోకి చేరుతుండేది. కాని ఈ నాలా ఎక్కడికక్కడ కబ్జాకు గురి అవ్వడంతో చుట్టుపక్కల ఉన్న నివాసాలను ముంచెత్తుతోందని రామ్‌నరేష్ నగర్ కాలనీ వెల్ఫేర్ ఆసోసియేషన్ హైడ్రాకు ఫిర్యాదు చేసింది. కుండపోత వర్షాల వేళ ఉన్న నాలాలు సరిపోని పరిస్థితి ఉంటే.. అవి కూడా కబ్జా అవ్వడం బాధాకరమని.. ప్రభుత్వం సరైన విధానంతో ఆక్రమణలను తొలగించాలని అసోషియేషన్ ప్రతినిధులు కోరారు.

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం రేణుక యెల్లమ్మ కాలనీలో 1600ల గజాల పార్కు స్థలంతో పాటు.. ప్రజావసరాలకు ఉద్దేశించిన 800 గజాల స్థలం కబ్జాకుగురి అవుతోందని.. స్థానికంగా అధికారులకు పిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని.. హైడ్రా అధికారులు జోక్యం చేసుకుని ఆ స్థలాలను కాపాడాలని ఆ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రాకు పిర్యాదు చేశారు.

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మండలం మూసాపేటలోని అంజయ్యనగర్‌లో ఉన్న పార్కును కాపాడినందుకు హైడ్రాకు అక్కడి నివాసితులు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఈ పార్కు అభివృద్ధికి రూ. 50 లక్షలు జీహెచ్ ఎంసీ కేటాయించడం.. పనులు చేపడితే కొంతమంది అడ్డుకోవడం జరిగింది. దీంతో పనులు ఆపేసి అలాగే వెళ్లిపోయిన జీహెచ్ ఎంసీ అధికారులు. ఇప్పుడు కబ్జాలు తొలగినా పార్కు అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడం బాధాకరమని ప్రజావాణి ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ప్రకటించిన రూ. 50 లక్షల కోసం మళ్లీ ప్రతిపాదనలు పంపామని జీహెచ్ ఎంసీ స్థానిక అధికారులు కాలయాపన చేస్తున్నారని.. దీంతో పార్కు ఉండి ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. ఉప్పల్ మండలం బండ్లగూడ నాగోల్ సర్వే నంబరు 36/6 లో ఉన్న ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవుతోందని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 35/5 ను చూపించి అనుమతులు తెచ్చుకుని 36/6 లోని 3 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక అధికారులకు ఈ విషయం తెలిసినా చర్యలు తీసుకోవడంలేదని వాపోయారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించడానికి హైడ్రా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# అంధ విద్యార్థులకు సంగీత వాయిద్య పరికరాల పంపిణీ

**– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగీత వాయిద్య పరికరాలను పంపిణీ**

**వేద న్యూస్ డెస్క్:**



కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగీత వాయిద్య పరికరాలను పంపిణీ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో పంపిణీ చేయగా ఆ సామాగ్రితో వారు పాటలు పాడి ఆకట్టుకున్నారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగీతంలో విద్యార్థులకు తర్ఫీదునివ్వగా, సీఎం చేతుల మీదుగా వారికి వాయిద్య సామాగ్రి అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత ఖర్చులతో విద్యార్థులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం విద్యార్థులు పాడిన పాటల సీడీ, దివ్యదృష్టి వీడియో ఆల్బమ్‌లను సీఎం రేవంత్, మంత్రులు పొన్నం, అడ్లూరితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టు అంధులైన ఈ చిన్నారులు తమ దివ్యదృష్టితో సుదీర్ఘమైన సంస్కృత సమాసాలతో ఉన్న స్తోత్రాలను కూడా అలవోకగా పాడుతుండటం అభినందనీయమన్నారు. సొంత భాష కూడా సక్రమంగా ఉచ్చరించలేని ప్రస్తుత పరిస్థితుల్లో స్పష్టంగా రాగయుక్తంగా స్తోత్రాలు ఆలపించటం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు.

ఎంతో కృషి చేస్తే తప్ప ఇది సాధించలేరని, చిన్నారులు మరింత వృద్ధిలోకి రావాలని ఆశీర్వదించారు. కలెక్టర్ పమేలా సత్పతి విద్యారంగంలో చిన్నారులను ప్రోత్సహించటం ఆదర్శనీయమన్నారు. వీడియో ఆల్బమ్‌కు నంది శ్రీనివాస్ దర్శకత్వం వహించారు. కేబీ శర్మ సంగీతాన్ని అందించారు. లక్ష్మి గౌతమ్ వీడియో రికార్డు చేశారు. వీరితోపాటు సంగీత ఉపాధ్యాయురాలు సరళను సీఎం అభినందించారు. కఫిసో అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర సమన్వయంతో సాగిన ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్, కలెక్టర్ పమేలా సత్పతి, బాల గాయకులు సింధుశ్రీ, శ్రావణి, తిరుమల, అఖిల, నిత్యశ్రీ, జాహ్నవి, కల్పన, ప్రణయ్, సాయిరామ్, మణిదీప్, అక్షయ్, వరుణ్ తేజ్, మణిరతన్, లోహిత్‌తోపాటు ప్రభుత్వ బధిరుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతి పిల్లలతో కలిసి సచివాలయాన్ని సందర్శించారు.


# అమాయకుల నుంచి రూ. కోట్లు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లు

**- స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులంటూ వాట్సప్ గ్రూప్**

**- లాభాలొచ్చాయంటూ స్క్రీన్ షాట్లు**

**- తొలుత చిన్న మొత్తంలో నగదు ఆశ చూపి**

**వేద న్యూస్ డెస్క్:**



సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పన్నాగంతో, కొత్త మోసాలకు పాల్పడుతున్నారు. చేతిలో ఉండే స్మార్ట్ ఫోన్‌లోనే సమాచారం మొత్తం ఉండటంతో ఒక్క క్లిక్‌తో బ్యాంక్ ఖాతాల్లోని సొమ్మునంతటినీ ఖాళీ చేస్తున్నారు. మరి కొందరు పెట్టుబడుల పేరుతో మొదట లాభాలు చూపించి వారిపై పూర్తి నమ్మకం ఏర్పడ్డాక అధిక మొత్తంలో నగదు కాజేస్తున్నారు. ఇదే తరహాలో హైదారాబాద్‌లోని ఓ విశ్రాంత ఉద్యోగిని స్టాక్ మార్కెట్లో పెట్టుబడులతో భారీగా లాభాలు సంపాదించవచ్చు అని చెప్పి ఆశచూపారు. రూ.15 వేల లాభంతో ఎరవేసిన సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.6.8 కోట్లు కొట్టేశారు. బాధితుడు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ)కి ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్ హైదర్‌నగర్‌లో ఓ విశ్రాంత ఉద్యోగి (61) నివాసముంటున్నారు. ఇటీవల స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులంటూ "ఏ37 స్టాక్ మార్కెట్ సక్సెస్ స్ట్రాటజిక్ గ్రూప్" పేరుతో ఉన్న వాట్సప్ గ్రూప్‌లో ఆయన ఫోన్ నంబరును గుర్తుతెలియని వ్యక్తులు యాడ్ చేశారు. ఈ గ్రూప్‌లో కరీమ్ వర్మ అనే వ్యక్తి అమెరికా, భారత్ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు సంబంధించిన సలహాలు సూచనలు ఇచ్చేవాడు. ఈ గ్రూప్‌లోనే వాటికి సంబంధించిన పోస్టులను, లింకులను పంపేవాడు. ఆ గ్రూప్‌లో ఉన్న కొందరు సభ్యులు తమకు లాభాలు వచ్చినట్లు స్క్రీన్‌షాట్లు పోస్టు చేసేవారు. తర్వాత క్రిస్టిన్ అనే మహిళ ఆ విశ్రాంత ఉద్యోగితో మాట్లాడింది. ఆమె మాటలను ఆయన నమ్మారు. తర్వాత ఆగస్టు 11న రూ.50 వేలు పెట్టుబడి పెట్టారు. అయితే తనకు రూ.15 వేలు లాభం (30%) వచ్చినట్లు యాప్‌లో చూపించింది. కాగా ఆ డబ్బును ఆయన విత్‌డ్రా కూడా చేశారు. ఆపై మరింత నమ్మకంతో సెప్టెంబరు 11 వరకు విడతల వారీగా రూ. 6.8 కోట్లను వారు సూచించిన ఖాతాలకు బదిలీ చేశారు. అనుకున్న విధంగానే అయన పెట్టిన పెట్టుబడికి లాభం కలిపి రూ. 14.78 కోట్లు వచ్చినట్లు వెబ్‌సైట్స్‌లో కనిపించింది. కాగా ఈ నెల 12న రూ.1.5 కోట్లు విత్‌డ్రా చేసుకోవడానికి ఆయన ప్రయత్నించగా అది వీలు కాలేదు. తర్వాత ఆయన క్రిస్టిన్‌కు కాల్ చేసి మాట్లాడగా ఆమె రూ. 2.21 కోట్లు పన్ను చెల్లిస్తేనే పూర్తి నగదు విత్‌డ్రా అవుతుందని చెప్పింది. చివరికి తానే మోసపోయాయని గుర్తించిన విశ్రాంత ఉద్యోగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073